# అన్నా - తమ్ముడూ -

యస్. జయరామి రెడ్డి



సుబ్బారావు కవరుచింపి ఉత్తరం చదువుకున్నాడు. 'చిరంజీవి సుబ్బారావుకు, మీ పెదనాన్న దీవించి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. ఈ ఉత్తరం అందిన వెంటనే నీవు ఒక వారం రోజులు సెలవు పెట్టి ఇక్కడకు రావలెను. ఇది అర్జంటు.

మీ పెదనాన్న,

సుందర్రామయ్య.

సుబ్బారావుకు ఆ అర్జంటు ఏమిటో అర్థం కాలేదు. కాని ఆయన 'అర్జంటు' అని వ్రాశాడంటే అది 'డబుల్ అర్జంటు' అయివుండాలి! అందువల్ల అప్పుడే ఆఫీసుకు సెలవు పెట్టి బయలుదేరాడు సుబ్బారావు.

సుబ్బారావుకు పెదనాన్న సుందర్రామయ్యగారంటే ఎంతో భయమూ, భక్తీ ఉన్నాయి. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి సుబ్బారావును, తన స్వంత కుమారుడు ప్రసాద్‌తోపాటు చదివించి ఇంజనీరుని చేశాడు. తమ్ముడి కొడుకు అనే భావం ఆయనలో ఎన్నడూ కలుగలేదు. అందువల్లే సుబ్బారావుకి సుందర్రామయ్యగారంటే అంత ప్రేమ.

బండి దిగి ఇంట్లోకి వెళ్ళేప్పటికి ఆదుర్దా పడవలసిన పరిస్థితి ఏమీ కనిపించలేదు. కాకపోతే పెదనాన్న మామూలుకన్నా కొంచెం గంభీరంగా ఉన్నాడు. సుబ్బారావు భోజనం చేసి వచ్చి వరండాలో కూర్చున్నాడు. సుందర్రామయ్య పడక కుర్చీలో కూర్చుని చుట్ట చుట్టుకుంటున్నాడు.

చుట్ట చుట్టుకోవడం పూర్తి చేశాక ఆయనే సంభాషణ ప్రారంభించాడు. "మన ప్రసాద్ విషయం ఏమీ బాగులేదురా" అన్నాడు.

సుబ్బారావు మౌనం వహించాడు.

ఆయన లాల్చీ జేబులోంచి ఒక ఉత్తరంతీసి సుబ్బారావు కిస్తూ "ఇది చదువు. అంతా చదవనక్కర్లేదు. ఆ చివర భాగం చదువు నీకే అర్థమౌతుంది" అన్నాడు.


సుబ్బారావు ఉత్తరం చదివాడు: "—ఆ అమ్మాయి మా ప్రొఫెసర్ శంకరబాబుగారి రెండవ కుమార్తె. పేరు సవిత. మీకు అన్నివిధాలా తగిన కోడలని నా ఉద్దేశం. మీరు మీ ఆశీర్వాదాలను పంపిస్తే ఈ వేసవికాలంలోనే వివాహం చేసుకోటానికి సిద్ధంగా ఉన్నాను .... శంకరబాబుగారుకూడ ఈ వివాహానికి అంగీకరించాడు. మీ నుంచి జవాబు రాగానే ఆ విషయం శంకరబాబుగారికి తెలియజేస్తాను. ఆయన మీకు ఉత్తరం వ్రాసి మీ పరిచయం చేసుకోటానికి చాల ఆదుర్దా పడుతున్నాడు.

ఇట్లు మీ కుమారుడు

ప్రసాద్.

ఉత్తరం పూర్తి కాగానే సుందరరామయ్యగారు "చూశావా మీ తమ్ముడి ఘనకార్యం? వీడి వ్రాతలకు ఏమైనా అర్థముందా అంట? ఎవరో బెంగాలీ అమ్మాయి వీణ్ణి వలలో వేసుకొని ఆడిస్తుంటే వీడో వెర్రి కోతిలాగ ఆడుతున్నాడు. పెళ్ళి చేసుకొంటాడుట. పెళ్ళి! వీడు పెళ్ళి చేసుకోవాలంటే ఆ కలకత్తాలో బెంగాలీ పిల్ల తప్పితే ఇక్కడ పిల్లలే లేరా? ఆంధ్రదేశం గొడ్డుపోయిందనా వీడి ఉద్దేశం? చెప్పవోయ్ నువ్వన్నా చెప్పు!" అన్నాడు గుక్క తిప్పుకోకుండా. ఆయనలో అంతకుముందు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం అంతా మాయమైపోయింది.

"చెప్పాను. కాని.....కాని వాడిక్కడ లేడుగా మరి"



అన్నాడు సుబ్బారావు ఏం జవాబు చెప్పాలో తోచక.

"అందుకే గదటోయ్ నీకు ఉత్తరం వ్రాసింది! వెళ్ళు. ఇవ్వాళే బయులుదేరి కలకత్తా వెళ్ళు. వెళ్ళి వాడి ముఖం వాచేటట్లు చివాట్లు పెట్టు. ఇటువంటి వెధవ వేషాలువేస్తే ఇకనుంచీ దమ్మిడీ కూడ పంపనని చెప్పు. అవసరమైతే నాలుగు తన్ని, పోలీసు రిపోర్టు ఇచ్చి ఇక్కడకు లాక్కురా. తెలిసిందా?" అన్నాడు.

సుబ్బారావుకు తెలియలేదు.

"పోలీసు రిపోర్టు ఏమని ఇచ్చేది పెదనాన్నా!" అన్నాడు.

"అదేనోయ్. వాడికి పిచ్చెక్కిందని ఇవ్వు. ఇక వెళ్ళు. అక్కడ కాలేజిలో లెక్చరరు కోదండరావని నా బాల్యమిత్రుడొకడు ఉన్నాడు. వాడికి నేను ఇవ్వాళే ఉత్తరం వ్రాస్తున్నాను. అతని అడ్రసు ఇదుగో. నువ్వు కూడ అతని దగ్గరకెళ్ళి అతని సహాయం కూడ తీసుకో. ఉదయమే మెయిలుకు వెళ్ళవుగాని సిద్ధంగా ఉండు. ఆఁ, అడగటం మర్చిపోయాను. నీవైనా చక్కగా పెద్దవాళ్ళు చూసిన పిల్లను చేసుకొంటావా లేకపోతే ఏ అరవ పిల్లనో పట్టుకొని ప్రేమ, గీమ అంటావా మా వెధవలాగ" అన్నాడు.

సుబ్బారావు నవ్వుతూ "లేదు పెదనాన్నా, నేనుండేచోట అరవపిల్లలెవరూ లేరు. అంతా సాయిబులే" అన్నాడు.

సుబ్బారావు మర్నాడు ఉదయమే హౌరా మెయిలు ఎక్కాడు. స్టేషను ప్లాట్‌ఫారంమీదనుంచి రైలు పెట్టెలోకి ఎక్కేసరికి కలకత్తా వెళ్ళినంత పనైంది. పెట్టెలో అందరూ బెంగాలీవాళ్ళే ఉన్నారు. ఎలాగో ఒక మూల సీటు సంపాదించుకొని కూర్చున్నాడు.

సుబ్బారావూ, ప్రసాదూ స్వంత అన్నదమ్ములు కాకపోయినప్పటికీ అంతకన్న ఎక్కువ సోదరభావంతోనే కలసి ఉండేవారు. ప్రసాదు వయసులో సుబ్బారావుకన్నా నాలుగైదేళ్ళు చిన్న. ఇద్దరూ కలసి వాల్తేరులో చదువుకొంటున్నప్పుడు ప్రసాద్‌లో ఈ వికిరి లక్షణా లేమీ లేవు. కాని ఇంతలోనే ఇంత మారిపోతాడని అనుకోలేదు. పెదనాన్న అన్నట్లు ఈ ఆంధ్రదేశంలో ఆడపిల్లలే లేరని ఆ బెంగాలీ అమ్మాయిని చేసుకోవట మేమిటి? బహుశా ఏదో కుర్రతనంవల్ల ఆ ప్రేమ వ్యవహారంలోపడి ఉంటాడు. ప్రసాద్ బాగా డబ్బుగలవాడని తెలుసుకొని ఆ బెంగాలీ పిల్ల పెళ్ళి చేసుకోమని పట్టుబట్టి ఉంటుంది. లేకపోతే ఆ పిల్లకు మాత్రం కలకత్తాలో వాళ్ళజాతివాళ్ళు దొరక్క వీడినే ప్రేమించటమేమిటి? ఇది తప్పకుండా ప్రసాద్ అమాయకత్వాన్ని ఆధారం చేసుకొని ఆ బెంగాలీవాళ్ళు ఆడుతూన్న నాటకమే అయి ఉండాలి! ఏలాగైనాసరే తమ్ముణ్ణి ఈ రొంపిలోంచి



బయటకు లాగాల్సిందే. అవసరమైతే బలప్రయోగం చేసేంత చనువు కూడ తనకున్నది. అదీకాక పెదనాన్న ఆ అధికారం తనకు ఇవ్వనే ఇచ్చాడు.

ఎలాగైతేనేం రొప్పుతూ, రోజుతూ, రోజున్నర ప్రయాణంచేసి, హౌరా—మద్రాసు మెయిలు తన బాధ్యత తీరినట్లు ఒక నిట్టూర్పు విడిచి, హౌరా స్టేషన్లో ఆగిపోయింది.

ప్రసాద్ పెట్టెలన్నీ వెతుక్కుంటూ సుబ్బారావు ఉన్న చోటికి వచ్చాడు. అన్నయ్యను అంత దూరంలోనే చూసి లైసెన్సు పోర్టరును పిలుస్తూ "నీ టెలిగ్రాం ఇంతకుముందే అందింది అన్నాయ్" అన్నాడు.

ఇద్దరూ స్టేషను బయటకు వచ్చారు.

"నువ్వు ఇక్కడే భోజనం చేయటం మంచిది. ఇక్కడ దగ్గర్లోనే ఒక హోటల్లో మన భోజనం దొరుకుతుంది" అన్నాడు ప్రసాద్.

"మరి నువ్వో"

"నాకు బెంగాలీ భోజనం అలవాటైంది."

"ఓహో" అన్నాడు సుబ్బారావు కోపంగా.

సుబ్బారావు భోజనం చేశాక ఇద్దరూ ఒక టాక్సీ ఎక్కి, బజార్లన్నీ తిరిగి చివరకు ఒక చిన్న మేడ ముందు ఆగారు.

"ఈమేడపైనే నేను ఉండేది. క్రింద ఇంటి వాళ్ళు ఉంటారు" అన్నాడు ప్రసాద్.

ఇంటి చుట్టూ చిన్న పూలతోట ఉన్నది. వరండాలో నాలుగైదు పేము కుర్చీలు, రెండు సోఫాలూ ఉన్నాయి. ఇంటిముందు చక్కని కారు, ఇంట్లోంచి సన్నగా రేడియో సంగీతం వినిపిస్తోంది. ఇంటివారు ఎవరోగాని బాగా సంపన్నులే అయిఉండాలి అనుకొన్నాడు సుబ్బారావు. మేడమీద ప్రసాద్ ఉంటున్న గదిఒక్కటే ఉన్నది. రెండు కుర్చీలు, చిన్న టేబులూ చక్కగా అమర్చిన పుస్తకాలూ, తెల్లని పరుపూ చూడగానే అలసిపోయి వచ్చిన సుబ్బారావుకు 'హాయి' అనిపించింది.

"ఇపుడు స్నానం చేయటానికి వీలుంటుందా? అన్నాడు సుబ్బారావు నీరసంగా ఒక కుర్చీలో కూలబడుతూ.

"వేడినీళ్ళు కావాలా? చన్నీళ్ళా?"

"ఓహో ఇక్కడ వేడినీళ్ళకు కూడ పైపు లున్నాయా?"

ప్రసాద్ నవ్వుతూ "నువ్వు కావాలంటే క్రింద ఇంటి వాళ్ళ నౌఖరుతో చెప్పి పెట్టిస్తాను" అన్నాడు.

"సరే కానీయ్" అన్నాడు సుబ్బారావు.

ప్రసాద్ క్రిందకు దిగివెళ్ళి పది నిముషాల్లో నౌఖరును తీసుకొని మళ్ళీ పైకివచ్చాడు.

"ఇతనివెంట వెళ్ళు అన్నాయ్. స్నానానికి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి" అన్నాడు.

సుబ్బారావు ఆ నౌఖరువెంట స్నానంచేసి రావటానికి క్రిందకు వెళ్లాడు. అతను స్నానంచేసి మళ్ళీ పైకి వచ్చేసరికి ప్రసాద్ అవీ ఇవీ సర్దుతున్నాడు. సుబ్బారావు వస్తూనే "ఈ ఇంటి వాళ్ళు చాల మంచివాళ్ళులా వున్నారు. ఆ నౌఖరు కూడ నేనేదో వాళ్ళ బంధువైనట్లు మర్యాదలు చేస్తున్నాడు. వాడికి తెలుగు కూడ వచ్చునే!" అన్నాడు.



"అవునన్నాయ్. వాళ్ళు చాల మర్యాదస్థులు. మన తెలుగువాళ్లే" అన్నాడు ప్రసాద్.

సుబ్బారావు బట్టలు వేసుకొని ఇక అసలు విషయానికి వద్దాం అనుకొన్నాడు. కాని నిద్ర ముంచుకొస్తోంది. అందువల్ల రేపు తాపీగా మాట్లాడవచ్చులే అనుకొంటూ మెత్తని పరుపు మీద నడుం వాల్చాడు. మరుక్షణంలోనే గాఢంగా నిద్ర పట్టింది.

మర్నాడు సుబ్బారావుకు మెలకువచ్చి చూసే సరికి ప్రసాద్ స్నానంచేసి, బట్టలు వేసుకొని ఏదో చదువుకొంటున్నాడు. సుబ్బారావు గబగబా బ్రష్ నోట్లోపెట్టి పళ్ళు తోమటం మొదలెట్టాడు. అంతలో ఏడెనిమిది సంవత్సరాలు వయసుగల ఒక అమ్మాయి మేడమీదకువచ్చి "నాన్నగారు ఇవ్వాళ మిమ్మల్నీ, మీ అన్నగార్నీ ఫలహారం చేయటానికి క్రిందకు రమ్మంటున్నారు" అన్నది చక్కని తెలుగులో.

"అలాగే వస్తామని చెప్పు పాపా" అన్నాడు ప్రసాద్.

సుబ్బారావు బట్టలు వేసుకొని తమ్ముడి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"నువ్వు వచ్చావని ఇంటివాళ్ళు ఫలహారానికి పిలిచారు. వెళ్దాం పద" అన్నాడు ప్రసాద్.

సుబ్బారావు గంభీరంగా ముఖంపెట్టి "కాదు ముందు నీతో మాట్లాడాలి" అన్నాడు.

ప్రసాద్ కొంచెం ఆశ్చర్యపడి "ఏమిటన్నయ్యా అది" అన్నాడు.

నాటకం జోరుగా సాగుతోంది. వీరుడైన పుత్రుని ఆశీర్వదించి దేశాంతరానికి తల్లి పంపే ఘట్టమది.

తల్లి:-'పుత్రా! నీ నోరు మంచిదైతే నీ భవిష్యత్తుకూడ ఆశాజనకంగా ఉంటుంది" అన్నది.

వెంటనే ఓ పల్లెటూరు రైతులేచి తల్లి నీవు రెండు నాలికబద్దలు కొనుక్కుంటే నీ ఆరోగ్యం బాగుపడుతుంది. తద్వారా నాటకం ఆశాజనకంగా ఉంటుంది" అని కూర్చున్నాడు.

కన్నెగంటి వెంకటేశ్వరరావు
(తెనుకు)

"నీ ప్రేమ వ్యవహారం. నీ వాలకం నాకేమీ నచ్చలేదురా" అన్నాడు గంభీరంగా.

ప్రసాద్ తేరుకున్నాడు. ఓహో అయితే నాన్నగారు నీ కా ఉత్తరంలో విషయాలన్నీ చెప్పారన్నమాట.

"ఊరక చెప్పటంకాదు. నీకు బుద్ధి చెప్పటానికై నాచేత సెలవు పెట్టించి ఈ కలకత్తా కూడ పంపించారు" అన్నాడు.

"ఇందులో బుద్ధిచెప్పటానికి నేను చేసిన తప్పేమీలేదు. ఆ అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటానన్నాను. ఇందులో తప్పేముంది?" అన్నాడు ప్రసాద్.

"తప్పేమీ లేదంటావా? పెంచి పెద్దవాడినిచేసిన తండ్రిని ఎదిరించి, మన జాతీ, మన కులమూ కాని ఎవర్నో పెళ్ళి చేసుకుంటాననటం తప్పుకాదూ? పెద్దవాళ్ళంటే నీకున్న గౌరవం ఇదేనా?"

"గౌరవం వుండబట్టే ముందుగా ఉత్తరం వ్రాసి ఆశీర్వాదాలు కోరాను"

"ఏమైనాసరే. ముక్కూ మొఖం తెలియని వాళ్లో ఒక అనామకుల పిల్లను చేసుకొని మన వంశమర్యాదకు భంగం తెచ్చుకోవటం నా కిష్టం లేదు."

"వాళ్ళు అనామకులేమీకారు. మనకన్నా పేరు, ప్రతిష్ఠలూ, డబ్బూ ఉన్నవాళ్లే."

"అయినా సరే. వాళ్ళు బెంగాలీలు"

ప్రసాద్ అసహనంతో "వాళ్ళు బెంగాలీలని ఎవరన్నారు ? వాళ్ళు అచ్చమైన తెలుగువాళ్లే. కాకపోతే చాలకాలంనుంచీ ఇక్కడ ఉండటాన పేర్లు మాత్రం బెంగాలీవాళ్ళలా వుంటాయి—అదుగో మనకోసం మళ్ళీ వాళ్ళ నౌఖరు వస్తున్నాడు. తరువాత మాట్లాడుకోవచ్చు. ముందు ఫలహారానికి వెళ్దాం పద" అన్నాడు.

ఇద్దరూ మౌనంగా క్రిందికిదిగి వెళ్ళారు.

గదిలో అడుగు పెట్టేప్పటికి అందరూ వీళ్ళ కోసమే ఎదురు చూస్తున్నారు. తెల్లని సిల్కులాల్చీ, తెల్లని ధోవతీ ధరించి, కళ్ళజోడు పెట్టుకొన్న ఒక వ్యక్తి వీళ్ళను ఆహ్వానించాడు. ఆయన ప్రక్కనే, ఆయన భార్య కాబోలు ఒక వయసు మళ్ళినావిడ కూర్చుని ఉన్నది. ఆ తరువాత ఇద్దరు యువతులూ, ఇంతకు పూర్వం మేడమీదకు వచ్చిపోయిన పాపా ఉన్నారు.

ముసలాయన అందర్నీ పరిచయం చేశాడు. "ఈవిడ నా భార్య. వాళ్ళు ముగ్గురూ నా కూతుళ్ళు. మీ గురించి ప్రసాద్ నాతో నిన్ననే చెప్పాడు. మా గురించి గూడ ఈపాటికి మీకూ చెప్పేవుంటాడు. ప్రసాద్ ఇంతకుముందే మా కుటుంబంలో కలిసిపోయాడు. ఇక మీరు కూడ మమ్మల్ని అన్యులుగా భావించమని మాట ఇస్తే మేము చాల సంతోషిస్తాం" అన్నాడు.

నిజానికి ప్రసాద్ వాళ్ళను గురించి ఏమీ చెప్పలేదు. బహుశా తాము ఆ ప్రేమ గొడవల్లో ఉండటాన చెప్పటానికి వీలులేకపోయివుంటుంది. అంతమంది కొత్తవాళ్ళమధ్య సుబ్బారావుకు బిడియంగానే ఉంది. కాని త్వరలోనే ఆ బిడియం కాస్తా పోయింది. ముసలాయన చాల కలుపుగోలుతనంతో సరదాగా మాట్లాడుతున్నాడు. ఆ యువతులిద్దరూ ఇంటరెస్టుతో వీళ్ళ కబుర్లు వింటున్నారు.

"ఐతే బాబూ, ప్రసాద్ నాన్నగారిపేరు ఇదివరకే నాకు తెలుసు. మరి మీ నాన్నగారి పేరేమిటి?" అన్నాడు ముసలాయన సుబ్బారావు నుద్దేశించి.

"మా నాన్న, వాళ్ళ నాన్నా అన్నదమ్ములేనండీ. వాళ్ళనాన్నపేరు కాళిదాసు" అన్నాడు ప్రసాద్, సుబ్బారావుకు బదులు తనే సమాధానమిస్తూ.

అంతవరకూ మౌనంగా కూర్చుని ఫలహారం తింటూన్న వాళ్ళ మూడో అమ్మాయి హఠాత్తుగా తలఎత్తి ప్రక్కనేవున్న వాళ్ళ అక్కను ఉద్దేశించి "అక్కా, కాళిదాసంటే అభిజ్ఞానశాకుంతలం వ్రాసినాయనేకదూ? ఆయన చాల గొప్ప కవి. అలా అని మా తెలుగుమేస్టారు చెప్పారు లేవే!" అంది.

వాళ్ళ అక్క సిగ్గుపడిపోయి "ఛీ, ఊరుకోవే. ఆ కాళిదాసు ఈకాలంవాడు కాదు" అన్నది.

"ఫరవాలేదులే. మా చిన్నాన్న కూడ ఈ కాలంవాడు కాదు — స్వభావంలో" అన్నాడు ప్రసాద్ ఆ యువతి వేపు చూస్తూ.

అందరూ నవ్వారు.

ఆ యువతి ప్రసాద్‌వేపు కృత్రిమ కోపంతో చూస్తూ "చాల్లెండి, పెద్దవాళ్ళమీదనా మన హాస్యాలు" అన్నది.

అప్పటివరకు మౌనంగా కూర్చునిఉన్న రెండో యువతి, మొదటి సారిగా సుబ్బారావు నుద్దేశించి "చూశారా, మా చెల్లికీ, ప్రసాదుకూ ఒక్క క్షణం కూడ పడదు. ఇంకా కొంచెం సేపట్లో వాళ్ళిద్దరూ 'కోల్డ్ వార్'లో దిగి మనందర్నీ మర్చిపోతారు. ఈ లోపునే మీ కాఫీ ముగించటం మంచిది" అన్నది.

సుబ్బారావు ఆ అమ్మాయి కలుపుగోలు తనానికి ఆశ్చర్యపోతూ ఆ యువతివేపు పరీక్షగా చూశాడు. చాల అందంగా ఉన్నది. తెల్ల షిఫాన్ చీరె, నల్లరంగు చోళీ, రెండు జడలూ....

ఎర్ర పూల సిల్కుచీరె కట్టుకున్న చెల్లెలు అక్కవేపు కోపంగా చూసింది.

ముసలాయన కూతుళ్ళవేపు ప్రేమగా చూస్తూ "రాక రాక ఎవరైనా తెలుగువాళ్ళు వస్తే మా అందరికీ ప్రాణం లేచివచ్చినట్లనిపిస్తుంది. చూశారుగా, ఇవ్వాళ మా పిల్లలు ఎంత సంతోషంగా ఉన్నారో! అందుకే మా అమ్మాయిల్ని దూరమైనా సరే తెలుగుదేశం నడిగడ్డన ఇవ్వాలనుకొంటున్నాను" అన్నాడు సాభిప్రాయంగా ప్రసాద్‌వేపు చూస్తూ.

ఎర్ర చీరె యువతి ఎందుకో ప్రసాద్‌వేపుచూసి సిగ్గుపడుతూ తలవంచుకొన్నది. చెల్లెలు సిగ్గుపడటంచూసి తెల్ల చీరె అమ్మాయి తనలో తనే నవ్వుకొన్నది. సుబ్బారావుకు ఈ నాటకం అర్థం కాక కొంచెం గందరగోళంలో పడ్డాడు.

అలా సరదా కబుర్లతో ఫలహారం ముగించారు. సుబ్బారావూ, ప్రసాదూ వాళ్ళందరివద్దా సెలవు తీసుకుని మేడమీద తమ గదికి బయలుదేరారు. సుబ్బారావు మనసు చాల ఉల్లాసంగా ఉన్నది. తాను కలకత్తాలో ఏదైతే దొరకదని బాధ పడ్డాడో, ఆ కాఫీ దొరికింది. ఎంతో కలుపుగోలుతనంతో తనను ఆదరించిన ఆ కుటుంబాన్ని చూసేసరికి సుబ్బారావు మనసులో ప్రసాద్‌మీద కలిగిన కోపం కూడా మాయమైపోయింది. ముచ్చటైన కుటుంబం. అమాయకంగాఉన్న ముగ్గురు అక్క చెల్లెళ్ళు అతని కళ్ళముందు మెదలసాగారు. ముఖ్యంగా ఆ తెల్లచీరె యువతి—ఎంత అమాయకంగా నవ్వుతుంది! అనుకొన్నాడు సుబ్బారావు.

ప్రసాద్ తలవంచుకొని మేడమెట్లు ఎక్కుతున్నాడు.

"చాల మంచివాళ్ళలాగున్నారు. వాళ్ళ కుటుంబం చూస్తుంటే నాకు చాల ముచ్చటగా ఉంది. ఆడపిల్లలు కూడ అనవసరమైన సిగ్గును ప్రదర్శించలేదు. చాలసంస్కారం కలవాళ్ళనుకొంటాను?" అన్నాడు సుబ్బారావు.

"అవును. ఆ ఇద్దరమ్మాయిలూ గ్రాడ్యుయేట్స్" అన్నాడు ప్రసాద్. ఇద్దరూ రూములోకి వచ్చారు.

"ఇక మన వ్యవహారం తేల్చు" అన్నాడు సుబ్బారావు.

"ఏమిటీ?"

"అదే. నీ పెళ్ళి సంగతి. మీ నాన్న ఈ పెళ్ళికి చచ్చినా ఒప్పుకోడు"

"దాని విషయం యింకా చెప్పేదేముంది? నా నిశ్చయం ఇదివరకే చెప్పాను. దానికి తిరుగు లేదు" అన్నాడు ప్రసాద్.

"అంతేనన్నమాట! సరే—ఆ అమ్మాయిని నాకొకసారి చూపిస్తావా?"

ప్రసాద్ ఒప్పుకోకపోయినా, ఆ అమ్మాయిని కలుసుకొని ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదనిచెప్పి ఆ అమ్మాయినైనా ఒప్పించాలని సుబ్బారావు ఉద్దేశం.

"నేను చూపించేదేముంది. ఇప్పటివరకూ చూసే వచ్చావుగా" అన్నాడు ప్రసాద్. తాపీగా.

సుబ్బారావు నివ్వెరపోయాడు "ఐతే — ఐతే ఆయనేనా శంకరబాబంటే ?"

"అవును. ఆయనే శంకరబాబు. మాకు ప్రొఫెసరు కూడ ఆయనే" అన్నాడు.

"ఆ ఇద్దరు యువతుల్లో—ఎవర్ని నువ్వు ప్రేమించింది?"

"ఆ ఎర్రపూల చీరెకట్టుకొన్నదే ఆ అమ్మాయి. శంకరబాబుగారి రెండో కుమార్తె. పేరు సవిత. తెల్లచీర కట్టుకొన్న ఆ రెండో అమ్మాయి ఈవిడ అక్క. కొద్ది రోజుల్లో నాకు ఒదిన కాబోతోంది. పేరు పార్వతి. ఇంకా ఏమైనా వివరాలు కావాలా ?" అన్నాడు ప్రసాదు విసుగ్గా.

అవును. ఇంకా వివరాలు కావాలి! ఆ తెల్లచీరె అమ్మాయి—పార్వతినిగురించి ఇంకా చాల వివరాలు కావాలి. కాని తమ్ముణ్ణి ఏ ముఖం పెట్టుకొని అడగటం? ఇప్పటివరకూ తనే వాడికి బుద్ధి చెప్తున్నాడాయె ! సుబ్బారావు ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

ప్రసాద్ కొంచెంసేపుఉండి "నాకు ఇవ్వాళ ప్రాక్టికల్సు ఉన్నాయి. ఎగగొట్టటానికి వీల్లేదు. నేను యూనివర్శిటీకి వెళ్తున్నాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సుబ్బారావు అలా ఆలోచిస్తూ ఎంత సేపు కూర్చున్నాడోకాని శంకరబాబుగారి నౌఖరు గదిలోకి వచ్చేసరికి ఈ లోకంలో పడ్డాడు.

"మిమ్మల్ని భోజనానికి రమ్మంటున్నారు" అన్నాడు ఆ నౌఖరు.

సుబ్బారావు కొంచెం కంగారుపడి "ప్రసాద్ కాలేజీకి వెళ్ళాడు" అన్నాడు.

"ఆ బాబు సాయంత్రం వరకూ రారు. భోజనానికి రమ్మనేది మిమ్మల్నే"

సుబ్బారావు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించలేకపోయాడు. క్రిందకువెళ్తే పార్వతి కనిపిస్తుందని అతని ఆశ.

సుబ్బారావు దుస్తులు వేసుకొని వెళ్ళేసరికి పార్వతి కుర్చీలో కూర్చుని ఉన్నది. సుబ్బారావును చూడగానే కుర్చీలోంచి లేచి "రండి" అన్నది. సుబ్బారావు ఆ అమ్మాయి కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"మీ తమ్ముడు లేకుండా కొత్త ఇంట్లో భోజనం చెయ్యటం మీకు ఇబ్బందిగానే ఉంటుంది. కాని నాన్నగారూ, ప్రసాదూ యూనివర్శిటీకి వెళ్ళిపోయారు. సాయంత్రం వరకూ రారు" అన్నది.

"అబ్బే ఇబ్బందేముందండీ. మీ ఆదరణలో నాకు అభిమానంవున్న సంగతి కూడ మర్చిపోతున్నాను" అన్నాడు.

ఆ అమ్మాయి చల్లని వెన్నెలలా నవ్వింది. "మీరు హైదరాబాదులో జూనియర్ ఇంజనీరుగా చేస్తున్నారనే ప్రసాద్ చెప్పాడు. కాని భర్త్రాజీ ఉద్యోగం కూడ చేస్తారని చెప్పనేలేదు" అన్నది.

సుబ్బారావు కూడ నవ్వాడు. ఇప్పుడు అతని సంకోచం పూర్తిగా పోయింది. "నా ఉద్యోగానికేంలెండి. మీకేమీ అభ్యంతరం లేకపోతే మీ భర్తగారు ఏం ఉద్యోగం చేస్తారో తెలుసుకోవాలని ఉన్నది" అన్నాడు.

ఆ మాటలు వినగానే పార్వతికి నవ్వు ఆగలేదు. పకపకా నవ్వుతూ "మీరెంత అమాయకులండీ. పెళ్లైతే మెడలో మంగళసూత్రం కనపడదా? అలా కనపడకండా ఉండటానికి నేనేమీ చంద్రమతిని కాదే" అన్నది.

సుబ్బారావు కూడ మనస్ఫూర్తిగా నవ్వకుండా ఉండలేకపోయాడు.

భోజనం చేసివచ్చి రూములో పడుకొంటే సుబ్బారావుకు ఎంతకూ నిద్రపట్టలేదు. తెల్లచీరె, అమాయకంగా కళ్ళు. చిన్న పిల్లలా నవ్వే పార్వతి గుర్తుకొస్తోంది. రక రకాల ఆలోచనలతో అతను సుడితిరుగుతున్నాడు. "సాయంకాలం నాలుగుకి మళ్ళీ పిలిపించుకోకండా టీ తాగటానికి రండేం" అన్న పార్వతి మాటలు గుర్తుకొచ్చాయి. సాయంత్రం ఎప్పుడౌతుందా అని ఎదురుచూస్తున్నాడు.

మూడు గంటలకు ప్రసాద్ యూనివర్శిటీ

---

"మీ వ్రాత సరిగాలేదు. టైపు చేసి తీసికొస్తే..." అన్నాడు సంపాదకుడు.

"అయ్యా! టైపుచేయడం వస్తే ఈ వెధవ కవిత్వం రాసుకొనే వాణ్ణా?" అన్నాడా రచయిత.

పి. కృష్ణమూర్తి, (కడప)







రెమి హాస్యనాటకం—ప్రతి శుక్రవారం రేడియో సిలోను 41.75 మీటర్ల మీద సా॥ 6-30 నుండి 6-45 గంటలవరకు వినండి.


## అన్నా - తమ్ముడూ

నుంచి వచ్చాడు. ప్రసాద్ రాగానే "తమ్ముడూ! నేను ఇదివరకు నిన్ను అన్నమాటలకు ఏమీ అనుకోనంటే నేనొక విషయం చెప్తా్రా" అన్నాడు సుబ్బారావు.

"అదేమిటన్నాయ్! నువ్వు పెద్దవాడివి. అదీ గాక నువ్వేమన్నావని?" అన్నాడు కొంచెంఆశ్చర్యంతో.

సుబ్బారావు రెండు మూడు క్షణాలు ఆగి మెల్లగా "నేను పార్వతిని ప్రేమించానురా" అన్నాడు.

*   *   *

అక్కడ, విజయవాడలో సుందర్రామయ్యగారు ఖంగారు పడుతున్నాడు. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తానన్న సుబ్బారావు ఇంతవరకూ రాయలేదు. చివరకు స్వయంగా తనే కలకత్తా వెళ్దామనుకొంటూ ఉండగా బాల్య స్నేహితుడు కోదండరావు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

ప్రియమైన స్నేహితునికి,

నేను క్షేమంగా ఉన్నాను. చి. సుబ్బారావువలన నీవు కూడ క్షేమంగానే ఉన్నావని తెలుసుకొని చాల సంతోషిస్తున్నాను.

నీవు రాసిన ఉత్తరం ప్రకారం మీ ప్రసాదు ప్రేమ వ్యవహారం నేను పూర్తిగా విచారించాను. ఇందులో మీవాడి తెలివితక్కువ పని ఏమీలేదు. ఇంకా చెప్పాలంటే చాల తెలివైన పనే చేశాడు. శంకరబాబులంటే తక్కువవాడుకాదు. విదేశాల్లో కూడా పేరు మోసిన ప్రొఫెసరు! ఆయన అచ్చమైన ఆంధ్రుడు. భాగ్యం విషయంలో కూడ నీకన్నా నాలుగైదు రెట్లు గొప్పవాడు. ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే. మొగపిల్లలు అసలు లేరు. ఎలా లేదన్నా మీ వాడికి లక్ష రూపాయల ఆస్తి వస్తుంది. అందువల్ల మీ వాడికి పిల్ల నిస్తానని ఆయన అంగీకరించటం నిజంగా మీ అదృష్టమే. మీవాడు ప్రేమించిన చి. సౌ. సవితను నేను చూసి వచ్చాను. నిజంగా నీకు తగిన కోడలు. ఇంకొక్క శుభవార్త! మీ తమ్ముడి కుమారుడు సుబ్బారావు శంకరబాబుగారి పెద్దకూతురు పార్వతీ కూడ మొదటి చూపులోనే ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. వీళ్ళ ప్రేమని కూడ శంకరబాబు అంగీకరించారు. నువ్వు కూడ దీని అంగీకరిస్తే ఒకే శుభ ముహూర్తాన అక్క చెల్లెళ్లను అన్నదమ్ములకిచ్చి వివాహం చేయటానికి ఏర్పాట్లు చేద్దాం. ఈ విషయాలన్నీ కుర్రవాళ్ళు నీతో చెప్పటానికి భయపడి నాతో మొర పెట్టుకొంటున్నారు. నువ్వు ఉత్తరం వ్రాస్తే ఆచారం ప్రకారం శంకరబాబుగారు అక్కడకువచ్చి నీతో బంధుత్వం ఖాయం చేసుకోటానికి ఆదుర్దా పడుతున్నారు.

నీ ప్రియ మిత్రుడు,
కోదండరావు.

ఉత్తరం చదివి సుందర్రామయ్యగారు ఒక్క క్షణం గాంభీర్యం వహించాడు. మళ్ళీ అంతలోనే నెరిసిపోయిన మీసాల్లోంచి చిరునవ్వు తొంగి చూసింది. "ఫర్వాలేదు. పిల్లనన్యాసులు మంచి పనులే చేస్తున్నారు. వీళ్ళకు ఇంత తెలివి ఎక్కణ్ణుంచి వచ్చిందబ్బా!" అని ఆశ్చర్యపడుతూ, గర్వంగా మీసాలు దువ్వుకొన్నాడు. ★